క్లుప్తంగా

ఎంఈఓ-1 ఎఫ్ఏసీగా బ్రహ్మం నాయక్



బాధ్యతలు చేపడుతున్న బ్రహ్మం నాయక్

కొత్తపల్లి: మండల విద్యాశాఖాధికారి-1 ఎఫ్ఏసీగా(ఫుల్ అడిషనల్ చార్జ్) బ్రహ్మం నాయక్ గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం వెలుగోడు ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడి ఎంఈఓ శ్రీరాములు పదవీ విరమణ పొందడంతో ఆస్థానంలో బ్రహ్మం నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఇనాయతుల్లా, రిటైర్డ్ ఎంఈఓ శ్రీరాములు ఉన్నారు.

నీటి ట్యాంక్ శుభ్రం



నీటి ట్యాంకును శుభ్రం చేయిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని నీటి ట్యాంక్‌ను అధికారులు గురువారం శుభ్రం చేయించారు. విద్యార్థులు తాగే నీటిలో ఉడుత కళేబరం కనిపించడంతో 'పాఠశాల నీటి ట్యాంకులో ఉడుత కళేబరం' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఉదయం సర్పంచు జమిలాబీ, పంచాయతీ కార్యదర్శి షేయిన్బా, హెచ్ఎం సుధాకర్ పంచాయతీ సిబ్బందితో ఉడుత కళేబరాన్ని తీసివేయించి, ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. ఇక మీదట విద్యార్థులకు ఎటువంటి సమస్య రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి

మహానంది: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎంఈఓలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓలు మోహన్‌రెడ్డి, యశోద తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విద్యార్థులకు బుక్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ 365 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్స్ అందించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, కేజీబీవీ ప్రిన్సిపాల్ దాక్షాయని పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి విశేషపూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు: టౌన్ సీఐ గా ప్రవీణ్ కుమార్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై క్రిమినల్ కేసు లు తప్పవన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా ప్రజలు స్వచ్ఛందంగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వీక్లీ ఆఫ్‌లు లేనట్లేనా?

- సిబ్బంది కొరతతో దక్కని సెలవు
- పనిఒత్తిడికి గురవుతున్న పోలీసు సిబ్బంది



జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్ ముఖచిత్రం

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఉండాల్సిన సిబ్బంది కంటే తక్కువగా ఉండటంతో వీక్లీ ఆఫ్(వారంలో ఒక రోజు సెలవు) వర్తించకపోవటంతో పోలీసు సిబ్బంది మనోవేదనకు గురవుతున్నారు. సిబ్బంది కొరత కారణంగా ఉదయం విధుల్లోకి చేరితే సాయంత్రం ఇంటికి ఎప్పుడు వెళ్తారో తెలియక సతమతమవుతున్నారు. కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాల నుంచి వచ్చే పోలీసు సిబ్బంది రాత్రి 8గంటలైనా ఇళ్లకు చేరుకోలేని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది సౌకర్యార్థం క్వార్టర్స్ ఉన్నాయి. ఇందులో నివాసం ఉన్నా, లేకపోయినా వారి జీతాల్లోంచి హౌస్ రెంట్(హెచ్ఆర్)కట్ అవుతుంది. దీనికితోడు పట్టణాల్లో ఇంటి అద్దెలు చెల్లించాల్సి రావటంతో రెండు విధాలుగా నష్టపోవాల్సి ఉంటుందని భావించి కొంత మంది పోలీసు సిబ్బంది డిప్యూటేషన్‌పై ఇతర పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

వాస్తవానికి జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 17మంది పోలీసు కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 26 మంది ఉండాలి. అయితే ఓ ఏఎస్ఐ, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 10 మంది కానిస్టేబుళ్ల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం స్టేషన్‌లో ఎస్ఐ, ఏఎస్ఐతో పాటు కేవలం ఏడుగురు కానిస్టేబుళ్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఏడుగురిలో ఒకరు సెంట్రీ, ఒకరు కంప్యూటర్, ఒకరు కోర్టు డ్యూటీకి పోనూ మిగిలేది కేవలం నలుగురు కానిస్టేబుళ్లే. వీరు 12 గ్రామపంచాయతీల్లో పర్యటించి ఎంపుడు ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లటం కష్టమంటున్నారు. అరకొర సిబ్బందితో విధులు నిర్వర్తిస్తున్న తమకు సకాలంలో ఇళ్లకు చేరుకోలేకపోగా గత కొన్ని మాసాలుగా వీక్లీ ఆఫ్ వర్తించటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల తాము మానసిక సమస్యకు లోనవ్వాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. జిల్లా ఎస్పీ చర్యలు తీసుకొని జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో సిబ్బంది నియామకం చేపట్టడంతో పాటు వీక్లీఆఫ్ వర్తించేలా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిబంధనలకు తూట్లు

- ఉన్నఫలంగా వంట ఏజెన్సీ మహిళల తొలగింపు

పాములపాడు: నిబధనలకు పాతర వేస్తూ అధికారులు ఇష్టానుసారంగా తీసుకునే నిర్ణయాలకు గిరిజనులు బలవ్వాల్సిన పరిస్థితి దాపురించింది. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు మండల స్థాయి అధికారులు తలొగ్గాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నడూ లేని విధంగా తాము చెప్పిందే చట్టం, తాము చెప్పిందే శాసనం అన్న చందంగా మండలంలోని బానుముక్కల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ నిర్వాహకులైన గిరిజన మహిళలను తొలగించారు. బానుముక్కల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు 161 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో 2004 వ సంవత్సరం నుంచి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నాగమణి బాయి, మల్లేశ్వరీ బాయి, నాగమణి అనే ముగ్గురు గిరిజన(సుగాలి) మహిళలు వంట చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ నాయకులు కూడా గ్రామంలో ఎలాంటి పరిస్థితులు తలెత్తకుండా చేశారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా ఈ సమస్య రాలేదు. కాగా ప్రస్తుతం టీడీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి వంట చేస్తున్న వారిని తొలగించాలని, వారంతా వైఎస్ఆర్‌సీపీకి ఓట్లు వేశారనే విషయాలు తెరపైకి తెచ్చారు. నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధుల నుంచి గ్రామీణ స్థాయి నాయకుల వరకు సంబంధిత శాఖ అధికారిపై ఒత్తిడి తీసుకురావడంతో ఆ అధికారి చేసేదేమీ లేక నిబంధనలను సైతం గాలికొదిలి వంట ఏజెన్సీ మహిళలు తొలగించాలని ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌కు మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని హంద్రీనీవా కాలువ అడ్డంగా వేసిన రోడ్డును సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు-అమరావతి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ హంద్రీనీవా అధికారులకు సమాచారం ఇవ్వకుండా కాలువకు అడ్డంగా మట్టి వేయడం తగదన్నారు. రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేని పాతబ్రిడ్జిని కూల్చడం దుర్మార్గమన్నారు. కృష్ణ, తుంగభద్ర నదులు పొంగిపొర్లుతూ లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రం పాలవుతుందన్నారు. కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో పంటలు ఎండిపోతుంటే హంద్రీనీవా ద్వారా కర్నూలు జిల్లాలో చెరువులన్నీ నింపడానికి అవకాశం ఉన్నా, అనంతపురానికి నీళ్లు వదలడానికి అవకాశం ఉన్నా నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. నీళ్లు వదలకుండా ఆటంకం కలిగించిన నేషనల్ హైవే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, నాయకులు రాధాకృష్ణ, రామకృష్ణ, నారాయణ, స్థానిక నాయకులు రాఘవేంద్ర, మృత్యుంజయ్ ఉన్నారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



నందీశ్వరుడికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన మహానందీశ్వర గర్భాలయం ఎదురుగా ఉన్న నందీశ్వరుడికి గురువారం ప్రదోష కాలంలో నందీశ్వరాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవాచనం, తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలి

- ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.రాయుడు



మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.రాయుడు

ఆత్మకూరు: ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.రాయుడు సూచించారు. ఆర్డీటీ సహకారంతో చెంచుగూడెం గర్భిణులు, చెంచు మహిళలు గురువారం సీహెచ్‌సీలోకి వచ్చి రక్త, స్కానింగ్ తదితర పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.రాయుడు మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యకరమైన బిడ్డను ప్రసవించాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పుట్టిన పిల్లలకు ముర్రుపాలు తాపాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ లీలావతి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారంపై వివరించారు. కార్యక్రమంలో వైద్యులు నాగరాజు, నర్సింగ్ ఆఫీసర్లు సరోజినీ, మానస, అరుణజ్యోతి, మెడ్ నర్సింగ్‌ఆఫీసర్ వసంతకుమారి, కల్లూరి పెద్ద మస్తానయ్య, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు శివకుమారి, రమాదేవి, కోమల, ఆర్డీటీ ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్స్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల సాగుతో లాభాలు మెండు



ఆయిల్‌పాం మొక్కలను నాటిస్తున్న హెచ్ఓ తేజశ్విని

జూపాడుబంగ్లా: ఆయిల్‌పామ్ తోటల సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చని హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని తెలిపారు. గురువారం మండలంలోని తంగడంచ రెవెన్యూ పరిధిలోని రైతు షేక్ హుసేన్ సాహెబ్ పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోర్లు, బావుల్లో నీళ్లుండే రైతులు ఎన్ఎంఈఓపీ పథకం ద్వారా ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసుకుంటే ఏడాదికి రూ.5 వేల చొప్పున నాలుగేళ్లపాటు చెల్లిస్తామన్నారు. అంతర్‌పంటల సాగుకు ఏడాదికి రూ.5,500 చొప్పున నాలుగేళ్ల పాటు ఇస్తామన్నారు. వీటితోపాటు మరిన్ని అవకాశాలున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ వెంకటేశ్వర్లు, హెచ్ఈఓ సురేష్ పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

పాములపాడు: తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, రైతు శిక్షణా కేంద్రం ఏఓ హేమలత రైతులకు సూచించారు. గురువారం మండలంలోని వేంపెంట గ్రామంలో వరి పంటపై పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, అధిక లాభాలు పొంది ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం జీవామృతంతో విత్తన శుద్ధి, సూడోమోనాస్‌తో శుద్ధి ఎలా చేసుకోవాలో చూపించారు. కార్యక్రమంలో ఏఈఓ మద్దిలేటి పాల్గొన్నారు.

సారూ..నీటి వృథాను అరికట్టండి



ట్యాంకు వద్ద లీకవుతున్న నీరు

మహానంది: మండలంలో అతి పెద్ద గ్రామ పంచాయతీ గాజులపల్లెలో పారిశుద్ధ్య పనులు అధ్వానంగా ఉన్నాయంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో నిర్మించిన ట్యాంకు వద్ద పైపులైన్ లీకవుతుండటంతో నీరు కలుషితం అవుతుందని ఆరోపిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీని సరి చేసి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సున్నిపెంట ఏ శాఖ పరిధిలో ఉందో తేల్చండి

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంట గ్రామం ఏ శాఖ అధికారి పరిధిలో ఉందో తేల్చాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబును శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి కోరారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీశైలం పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన మన నీరు-మన సంపద కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ అత్యధిక జనాభా, భూమి కలిగిన సున్నిపెంటలో కొందరు భూములను ఆక్రమించుకుంటూ అనుమతులు లేకుండా హోటళ్లు, లాడ్జీలు నిర్మిస్తున్నారని, ఈ గ్రామాన్ని రీసర్వే చేయించి ఒక నోడల్ అధికారిని నియమించి క్రమబద్ధీకరించాలని కోరారు. 15 రోజుల కోసారి నీరు సరఫరా అవుతుండటంతో ఇక్కడి ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సిద్దేశ్వరం అలుగు ప్రాజెక్ట్ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువస్తూ సిద్దేశ్వరం వద్ద ఐకానిక్ బ్రిడ్జ్ కాకుండా, వంతెనతో కూడిన రిజర్వాయర్‌ను నిర్మిస్తే రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

అమ్మవారికి చీర సారె సమర్పణ



అమ్మవారికి చీర సారె సమర్పిస్తున్న మహిళలు

వెలుగోడు: ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని చౌడేశ్వరి దేవి అమ్మవారికి గురువారం చీర సారె సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి చీర సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం

నందికొట్కూరు: నియోజకవర్గంలో గురువారం ఆగస్టు నెల పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. వలంటీర్లను తప్పించి ఆ బాధ్యతలను టీడీపీ ప్రభుత్వం అధికారులకు అప్పగించింది. దీంతో ఇదేం ఖర్మరా బాబూ అని అసంతృప్తి వ్యక్తం చేస్తూ తెల్లవారుజామున 4 గంటలకే గ్రామాలకు చేరుకుని పింఛన్లు పంపిణీని చేపట్టారు. నందికొట్కూరు మండలంలో 97.14 శాతం, జూపాడుబంగ్లా 97.44, పాములపాడు 97, కొత్తపల్లి 97.69, మిడుతూరు మండలంలో 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఆయా మండలాల అధికారులు తెలిపారు.

మహానంది: మహానంది మండలంలో 97.73, బండిఆత్మకూరు మండలంలో 97.09 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఆయా మండలాల అధికారులు శ్రీనివాసరెడ్డి, విజయరావు తెలిపారు.

పింఛన్లు సకాలంలో పంపిణీ చేయండి

- ఎమ్మెల్యే జయసూర్య



పింఛన్ నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా: పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని తాటిపాడు గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ల సొమ్మును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు యాదవ్, వంగల కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మన్నగౌడు, గోరె సాహెబ్, వీరారెడ్డి, శ్రీనివాసగౌడు, ఖురేష్, మన్సూర్‌బాషా, ఉస్మాన్‌బాషా, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, ఏఈలు నాగేంద్ర, బషీర్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో 24.4 మి.మీ. వర్షం

ఆత్మకూరు: మండలంలో గురువారం 24.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం నుంచి ఓ మోస్తారు వర్షం కురిసింది. గత నెలలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం, ఈనెల మొదటి రోజే వర్షం కురవడంతో సాగుచేసిన మొక్కజొన్న, కంది పైర్లు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

8న ఎస్ఎంసీల ఎన్నికలు

మహానంది/జూపాడుబంగ్లా/నందికొట్కూరు: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు ఈనెల 8న నిర్వహించనున్నట్లు మహానంది, జూపాడుబంగ్లా,నందికొట్కూరు మండలాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. గురువారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు.

'సుప్రీం' తీర్పుపై సంబరాలు



పాములపాడులో స్వీట్లు తినిపించుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నందికొట్కూరు/పాములపాడు/పగిడ్యాల/ఆత్మకూరు/శ్రీశైలంటెంపుల్: మాదిగల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడంతో నందికొట్కూరు, పాములపాడు, పగిడ్యాల, ఆత్మకూరు, శ్రీశైలంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచి, బాణా సంచా పేల్చారు. అంబేడ్కర్ చిత్రపటాకు, విగ్రహాలకు పూలమాలు వేసి, నివాళులర్పించారు. ఇది తమ నాయకుడు మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితమన్నారు. నందికొట్కూరులో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ స్వాములు, ఆత్మకూరులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకులు చిలుకల రాబిన్సన్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి బాషా పోగుల దరగయ్య మాదిగ, ప్రధాన కార్యదర్శి మదనపల్లి బుజ్జి, పాములపాడులో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కోటా ప్రభాకర్, పగిడ్యాలలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టపోగు విజయుడు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కాగా శ్రీశైలంలో న్యాయవాది రవి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమన్నారు. న్యాయం అనేది అన్ని వర్గాల వారికి అందుతుందని మరోసారి ఈ తీర్పుతో స్పష్టమైందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పగిడ్యాల: స్థానిక ట్యాంక్ బడి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పడమర వనములపాడు గ్రామానికి చెందిన నాగశేషి గాయాల పాలయ్యాడు. నాగశేషికి కొంత కాలంగా ఆరోగ్యం బాగోలేకపోవడంతో అంత్రం వేయించుకోవడానికని బైక్‌పై ఓ భూత వైద్యుని వద్దకు బయలుదేరాడు. బస్టాండు సమీపంలోకి చేరుకోగానే ఇతన బైక్, ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్నాయి. ప్రమాదంలో నాగశేషికి కాళ్లు, చేతులు, తలకు రక్త గాయాలయ్యాయి. స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

వాహనాలకు వేలం పాటలు

నందికొట్కూరు: మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం పాటలు నిర్వహించినట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సెబ్ స్టేషన్‌లో 7 వాహనాలకు గాను 5 వాహనాలు వేలంలో అమ్ముడుపోగా రూ.53,500లతో పాటు జీఎస్టీతో కలిపి రూ.96,760 ఆదాయం వచ్చిందన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



మహిళలకు సూచనలు తెలియజేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న బాపనంతాపురం గ్రామంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. డాక్టర్ పవన్‌కుమార్ పాల్గొని గర్భిణులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రసవం జరిగిన వెంటనే తప్పనిసరిగా ముర్రుపాలను బిడ్డకు పట్టించాలన్నారు. తద్వారా బిడ్డలకు రోగనిరోధక శక్తిని పెంపొందించిన వారవుతారన్నారు. గర్భిణులు ప్రతినెలా ప్రభుత్వ ఆస్పత్రిలోనే చెకప్‌లు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఫాతిమా, ఆరోగ్యకార్యకర్తలు భాస్కర్, ఆశా కార్యకర్తలు ప్రమీల, రంజిత కుమారి పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై రాజమహేంద్రవరం, దవళేశ్వరానికి చెందిన రాధాకృష్ణ సంగీత నృత్య కళా క్షేత్ర వారి సంప్రదాయ నృత్యం అలరించింది. వినాయకకౌత్వం, మహాగణపతిం, లింగాష్టకం, కాలభైరవాష్టకం, కనకధారస్తోత్రం, ఆనందతాండవం తదితర గీతాలకు, అష్టకాలకు లక్ష్మీదీపిక, హర్షిత, అమృత, కార్తికేయని, భవ్యతేజస్విని, కీర్తి పర్ణిక, శరణ్య, పూజ, వర్షిణి, ప్రణీత, కావ్య, భవ్య సిరిచందన, ప్రణవి, కిరణ్మయి తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

ముర్రుపాలలో రోగనిరోధక శక్తి అధికం



తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు దీపానాగవేణీ

కొత్తపల్లి: ముర్రుపాలలో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందని, పుట్టిన వెంటనే బిడ్డలకు తల్లి నుంచి వచ్చే ముర్రుపాలు తాగించాలని వైద్యురాలు దీపానాగవేణి సూచించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని దుద్యాల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-5లో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాంతులు, విరేచనాలు, జ్వరం తదితర సమస్యలతో బాధపడుతూ ఉంటే వెంటే వైద్యులను సంప్రదించాలన్నారు. నీటిని కాచి, చల్లార్చుకుని, వడబోసుకొని తాగాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బాలకృష్ణయ్య, వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్యాంకు నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?



దిష్టిబొమ్మగా దర్శనమిస్తున్న తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం గ్రామంలోని దళితకాలనీలో నిర్మిస్తున్న తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం త్వరగా పూర్తి చేసి కుళాయిలకు నీటిని సరఫరా చేయించాలని ప్రజలు కోరుతున్నారు. రెండేళ్ల క్రితం గ్రామానికి ప్రధానమంత్రి ఆదర్శయోజన పథకం కింద రూ.10 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.13 లక్షలు కలిపి రూ.23 లక్షలతో గ్రామంలోని దళితకాలనీలో తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం పనులు చేపట్టారు. పనులు దక్కించుకొన్న కాంట్రాక్టర్ 35శాతం మేర పనులు పూర్తిచేసి మిగిలిన పనులు చేయకుండా చేతులెత్తేశాడు. దీంతో నిర్మాణం పూర్తికాకుండా ఓవర్‌హెడ్ ట్యాంకు దిష్టిబొమ్మగా మారింది. ఈ విషయమై పక్షం రోజుల క్రితం మండల సర్వసభ్యసమావేశంలో గ్రామ సర్పంచ్ నాగార్జునరెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ట్యాంకు నిర్మాణం త్వరగా పూర్తిచేయించి గ్రామస్తులకు తాగునీటిని సరఫరా చేయించాలని విన్నవించారు. అయినా అధికారులు పట్టించుకోకపోవటంతో ట్యాంకు నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా తాగునీటిశాఖ అధికారులు చర్యలు తీసుకొని ట్యాంకు నిర్మాణం పూర్తిచేయించాలని పి.లింగాపురం గ్రామస్తులు కోరుతున్నారు.

సుప్రీం కోర్టు తీర్పును సవాల్ చేస్తూ అప్పీల్ చేస్తాం



మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు ఏసీహెచ్ నగేష్

నందికొట్కూరు: ఏడుగురితో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అప్పీల్‌కు వెళ్తామని మాలమహానాడు నాయకులు ఏసీహెచ్ నగేష్ తెలిపారు. గురువారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలే రాజకీయంగా,ఆర్థికంగా ముందంజలో ఉన్నా..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చి మాలలకు అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు. ఎస్సీలను విభజించుపాలించు నినాదంతో రాజకీయ పార్టీలు చిచ్చు పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలను చీల్చి ఓటు బ్యాంకుగా మలుచుకుంటున్నారన్నారు.ఎస్సీల ఐక్యత దెబ్బతీసేందుకు రాజకీయ కుట్రలు పన్నితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పార్టీలను హెచ్చరించారు. ఈనెల 9న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు మాలలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు మనోహర్ సురేష్, రత్నస్వామి, రాజు, పుల్లయ్య, దేవరాజు పాల్గొన్నారు.